దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఫిబ్రవరి 19: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసిస్తున్న మైనార్టీలు చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎండీ సర్వర్‌మియా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీజీ, డాక్టరేట్ కోర్సుల విద్యనభ్యసిస్తూ వారు ఇందుకు అర్హులని చెప్పారు. వెబ్‌సైట్‌లో (www.telangana epass.cgg.gov.in) ఈ నెల 20నుంచి మార్చి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం నంబర్లలో (99497 71639, 99499-10328) సంప్రదించాలని సూచించారు.

వివాహిత బలవన్మరణం

ముస్తాబాద్, ఫిబ్రవరి 19: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన కొండుగారి లాస్య (25)కు మూడేండ్ల క్రితం పోతుగల్ గ్రామానికి చెందిన కొండుగారి దేవరాజుతో వివాహమైంది. లాస్య సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. అదనపు వరకట్నం కోసం భర్త దేవరాజు, అత్తామామలు వేధించడంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకున్నదని లాస్య తండ్రి పంతం నాంపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును.
నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

వేములవాడ రూరల్: అయ్యేరుపల్లిలో శివాజీ విగ్రహానికి అభివాదం చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట: మామిడిపల్లి గ్రామంలో శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చందుర్తి: జోగాపూర్ నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు

పోరాటయోధుడు శివాజీ

- జిల్లా వ్యాప్తంగా ఛత్రపతి మహారాజ్ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

హిందువులు, హిందూ ఆలయాలపై దాడులు చేసిన వారిపై వీరోచితంగా పోరాట చేసిన యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా జరుపుకొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ మహనీయుడి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదర్శప్రాయుడైన శివాజీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో పలు గ్రామాల్లో ఛత్రపతి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక వాహనంపై వీధుల్లో శోభాయాత్ర చేశారు.
– వేములవాడ/ వేములవాడ రూరల్/ ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/చందుర్తి/ సిరిసిల్ల రూరల్/ గంభీరావుపేట/ కోనరావుపేట, ఫిబ్రవరి 19

ఎల్లారెడ్డిపేట: గొల్లపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

● వేములవాడ రూరల్ మండలం జయవరం, అయ్యేరుపల్లిలో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఛత్రపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన గొప్ప పేరు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. అలాగే ఆరెపల్లి, బొల్లారం గ్రామాల్లో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు సిలువేరి మల్లేశం, మండలాధ్యక్షుడు నరేశ్, తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. వెంకటాపూర్‌లో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా, గొల్లపల్లిలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు.

● ఇల్లంతకుంటలోని బస్టాండ్ ఆవరణలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేడుకల్లో వీహెచ్‌పీ మండలాధ్యక్షుడు ఎగుర్ల శ్రీనివాస్, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, మామిడి పరశురాం, బాలరాజు, రాంసేటు, రాజు, కిషన్, సత్యనారాయణ, రాజేశ్వరశర్మ, శ్రీహరి, విజయ్, శ్రీనివాస్, వెంకటేశం ఉన్నారు.

● తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం రాగుల బాలయ్య కుటుంబానికి 50కిలోల బియ్యం అందించారు. ఇక్కడ అధ్యక్షుడు కాసుగంటి రాజు, సభ్యులు ఉన్నారు.

● చందుర్తి మండల కేంద్రంతోపాటు జోగాపూర్, మర్రిగడ్డ, మల్యాల గ్రామాల్లో యువజన సంఘాలు, నాయకులు శివాజీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తర్వాత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మర్రిగడ్డ ఛత్రపతి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఇక్కడ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు శ్రావణ్, నేతికుంట రాజు, బొడిగ హరీశ్, బాలరాజు, శేఖర్, వేణు శ్రీకాంత్, వికాస్, తదితరులు ఉన్నారు.

● గంభీరావుపేటలో హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి విగ్రహంతో ర్యాలీ నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య యువకులు నృత్యం చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు.

● కోనరావుపేట మండల కేంద్రంతోపాటు మామిడిపల్లి, నాగారం, మల్కపేటలోని ప్రధాన కూడళ్లలో ఛత్రపతి శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఇక్కడ ఎంపీటీసీ మిర్యాల ప్రభాకర్‌రావు, నేతలు జితేందర్‌రెడ్డి, తిరుపతి, తదితరులు ఉన్నారు.

● వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. ఇక్కడ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేశ్, నాయకులు హన్మాండ్లు, గుడిసె మనోజ్, రేగుల రాజ్‌కుమార్ ఉన్నారు.

గంభీరావుపేట: శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందూ సేవా సమితి సభ్యులు

ఇల్లంతకుంట: నివాళులర్పిస్తున్న ఎంపీటీసీ నర్సయ్య

వనజాతరకు వేళాయె

- ఈ నెల 21నుంచి సమ్మక్క-సారలమ్మ మహోత్సవం
- మినీ మేడారంగా ఓబులాపూర్
- భారీగా తరలిరానున్న భక్తజనం

జాతర మహోత్సవానికి ముస్తాబైన సమ్మక్క-సారలమ్మ ప్రాంగణం

తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామం వనజాతరకు ముస్తాబైంది. ఈ నెల 21నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనుండగా, ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. అమ్మవార్లను దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని, సంతాన భాగ్యం కలుగుతుందని.. నిలువెత్తు బంగారం అందిస్తే.. తమ కలలు సాకారం అవుతాయని ఇక్కడి భక్తుల విశ్వాసం. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు భక్తులు భారీగా తరలివస్తుండడంతో ఈ ప్రాంతం మినీ మేడారాన్ని తలపిస్తున్నది.
– సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19

తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ శివారులోని సమ్మక్క-సారలమ్మ వనదేవతలు భక్తుల కొంగుబంగారంగా విరజిల్లుతున్నాయి. రెండేండ్లకోసారి ఇక్కడ వనదేవతల జాతర మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. 42ఏండ్లుగా జాతరను వైభవంగా నిర్వహిస్తుండగా, భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

21 జాతర ప్రారంభం

ఓబులాపూర్‌లోని సమ్మక్క-సారలమ్మ జాతర మహోత్సవం ఈ నెల 21న ప్రారంభంకానున్నది. 21న ఉదయం సమ్మక్క, సాయంత్రం సారలమ్మ గద్దెకు వస్తారని, 22న బండ్ల ప్రదర్శన, అమ్మవార్లకు బోనాల సమర్పణ, ఒగ్గు కథ కార్యక్రమాల నిర్వహణ, 23న ఒడిబియ్యం సమర్పణ, 24న వనదేవతలు వనప్రవేశం చేయడంతో జాతర ముగియనున్నది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా జాతర కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

వనదేవతల జాతరకు భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. వారికి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. బాత్‌రూంలు, స్నానపు గదులు నిర్మాణం పూర్తి చేశాం. తాగునీటితో పాటు ఇతర వసతులు కల్పించాం. నాలుగు రోజులపాటు జాతర జరుగనున్నది. గ్రామస్తులు, నిర్వహణ కమిటీ సభ్యుల సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేశాం.
– తిరుపతిరెడ్డి, జాతర నిర్వహణ కమిటీ చైర్మన్, ఓబులాపూర్

బాధ్యతలు స్వీకరించిన డీపీఆర్వో

కలెక్టరేట్, ఫిబ్రవరి 19: జిల్లా పౌరసంబంధాల అధికారి గా వీ శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భూపాలపల్లి జిల్లాలో పౌరసంబంధాల అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లాకు బదిలీ చేసింది. ఈ క్రమంలో సోమవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క-సారలమ్మ జాతరకు డిప్యూటేషన్ పై వెళ్లాలు. తిరిగి ఫిబ్రవరి 26 నుంచి జిల్లా పౌరసంబంధాల అధికారిగా విధులకు హాజరుకానున్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్

'పల్స్‌పోలియో' విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

కలెక్టరేట్, ఫిబ్రవరి 19: మార్చి 3నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పిలుపునిచ్చారు. పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణపై వైద్య, ఐసీడీఎస్, మున్సిపల్, పంచాయతీరాజ్, సెస్ లయన్స్, రోటరీక్లబ్, జిల్లా సంక్షేమశాఖ అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఐదేండ్లలోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కాగా, జిల్లాలో ఐదేండ్లలోపు చిన్నారులు మొత్తం 44,770మంది ఉన్నారని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత తెలిపారు. జిల్లాలో మొత్తం 394కేంద్రాలు ఏర్పాటు చేసి, పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామని వివరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా శ్రీరాములు, డీపీవో వీరబుచ్చయ్య, పీవో డా నయిమా, సీడీపీవోలు ఎల్లయ్య, అలేఖ్య, మున్సిపల్ ఈఈ ప్రసాద్, జీసీడీవో పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం 37దరఖాస్తులు స్వీకరించారు. సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇక్కడ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, తదితరులు ఉన్నారు. అలాగే తంగళ్లపల్లి మండలకేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత అదనపు కలెక్టర్లను కలిశారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎలక్టోరల్ అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎలక్టోరల్ అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఏప్రిల్ 1, 2024 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి కానున్న ప్రతి యువత ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు రూపొందించిన తుది జాబితా విడుదల తర్వాత ఆయా జిల్లాల్లో భారీగా కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు కోసం దరఖాస్తులు రావడం పై వికాస్‌రాజ్ ఆరా తీశారు. తుది ఓటరు జాబితా ప్రచురించి అన్ని పోలింగ్‌స్టేషన్లు, రాజకీయ పార్టీలకు పంపించామని అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయఖ్, పూజారి గౌతమి తెపారు. వీసీలో ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసచారి, ఏపీడీ నర్సింహులు, తహసీల్దార్ షరీఫ్ మొహినొద్దీన్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ అధ్యక్షుడిగా లక్ష్మణ్

గంభీరావుపేట, ఫిబ్రవరి 19: ముదిరాజ్ సంఘం మండల కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా శాత్రబోయిన లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా మచ్చ ఆనందం, పిట్ల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా పిట్ల బాబు, కోశాధికారిగా దేవదాస్, సంయుక్త కార్యదర్శిగా విజయ్, గౌరవాధ్యక్షుడిగా వీరబోయిన రమేశ్, సభ్యులుగా రమేశ్, రవి, బాలయ్య, రాజు, దేవయ్య, రాములు, లింగం ఎన్నికయ్యారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు

ఇల్లంతకుంట/చందుర్తి, ఫిబ్రవరి 19: ఇల్లంతకుంట ఎస్ఐగా ప్రశాంత్‌రెడ్డి సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన దాస సుధాకర్ తంగళ్లపల్లికి బదిలీ కాగా, తంగళ్లపల్లిలో పని చేసిన ప్రశాంత్‌రెడ్డి ఇల్లంతకుంటకు బదిలీపై వచ్చారు. అలాగే చందుర్తి ఎస్ఐగా సీహెచ్ శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన వెంకటేశ్వర్లు కామారెడ్డి జిల్లా తాడ్వాయికి బదిలీ కాగా, శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఇప్పటికే సీఎంతో పలుమార్లు చర్చించాం
- గాంధీ, శివాజీ విగ్రహావిష్కరణలో మంత్రి పొన్నం ప్రభాకర్

మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సత్యం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): మధ్యమానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారం బాధ్యత తమదేనని, ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డితో పలుమార్లు చర్చించామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని బోయినిపల్లి మండలం నిలోజీపల్లెలో విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి శివాజీ, గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలపై ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ అందరం కలిసి సీఎం రేవంత్‌రెడ్డితో పలుమార్లు చర్చించినట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేశామని, మిగిలినవి త్వరలోనే అమలు చేస్తామని చెప్పారు. సమ్మక్క-సారలమ్మ జాతరకు 6వేల బస్సులు తరలించడంతో బస్సుల కొరత ఏర్పడిందన్నారు. అయితే ఈ నెల 25 తర్వాత బస్సుల కొరత సమస్య పూర్తిగా తొలిగిపోతుందని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర సర్కారుకు తోడ్పాటు లభిస్తుందన్నారు. విప్ మాట్లాడుతూ, మహారాష్ట్రలో పేదలను అణిచివేసిన మొగలాయిలపై తిరుగుబాటు జరిపిన పోరాటవీరుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. బీసీ కులగణన వల్ల ఆయా రంగాలు ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు భీమారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగుల వంశీ, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న విప్ శ్రీనివాస్, వైస్‌పర్సన్ మాధవి, జోనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ గుప్తా

కోనరావుపేట, ఫిబ్రవరి 19: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రం లో 95మంది లబ్ధిదారులకు సోమవారం ఆయన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంపు అమలు చేశామని, మిగితా గ్యారెంటీలు త్వరలోనే అమలు చేస్తామన్నారు. ఇక్కడ తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, వైస్ ఎంపీపీ వంగపల్లి సుమలత, ఎంపీటీసీ నరసింహాచారి, తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో ఏడాదికి ₹13వేలకోట్ల వ్యాపారం

వేములవాడ, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఏడాదికి రూ.13వేల కోట్ల వ్యాపారాన్ని చేస్తున్నదని జోనల్ మేనేజర్ సుశాంత్ కుమార్‌గుప్తా పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రహదారిలో తెలంగాణలో 65వ బ్రాంచ్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మేనేజర్ మధుమోహన్‌రెడ్డి, కౌన్సిలర్ యాచమనేని శ్రీనివాసరావు, నాయకులు సాగరం వెంకటస్వామి, సంగ స్వామి, చిలుక రమేశ్, కూరగాయల కొమరయ్య, కనికరపు రాకేశ్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ముస్తాబాద్, ఫిబ్రవరి 19: ఆవునూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన బత్తుల రాజు ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని పూర్వ విద్యార్థులు (2002-03లో ఎస్సెస్సీ బ్యాచ్) సోమవారం పరామర్శించారు. ఈ క్రమంలో వారు రాజు కూతురు పేరిట ₹50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, సంబంధిత చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. ఇక్కడ మిత్రులు శ్రీకాంత్, అంకని రంజిత్, నక్కల భాస్కర్, పాతూరి భాస్కర్, శ్రీనివాస్, రవి ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ముస్తాబాద్, ఫిబ్రవరి 19: మండల కేంద్రంలో మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ భూమిపూజ చేశారు. పెద్ద చెరువు సమీపంలో ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చిన రజక సంఘం సభ్యులను ఆయన అభినందించారు. ఇక్కడ సంఘం సభ్యులు ఉన్నారు.

కిటకిటలాడిన రాజన్న ఆలయం

రాజన్న ఆలయ ప్రాంగణంలో భక్తులు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 19: వేములవాడ రాజన్న క్షేత్రం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. రెండు రోజుల్లో సమ్మక్క జాతర ఉండడంతో తొలిమొక్కు కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునే పవిత్ర గుండంలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కోడె, కల్యాణ మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, సుమారు 50వేల మంది స్వామివారిని దర్శించుకోగా, రూ.27లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు.

THE KARIMNAGAR DIST.CO-OP.CENTRAL BANK LTD,KARIMNAGAR
ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి॥ కరీంనగర్
RBI LICENCE NO: RPCD(H) Coop/6/05.08.03/2011-12, Dt: 28-11-2011 (ప్రభుత్వ భాగస్వామ్య సంస్థ)
email:kardccb@gmail.com, Our Website:www.karimnagardccb.org, Fax 0878-2262192

సర్వసభ్య సమావేశము నోటీసు

ది.కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి॥ కరీంనగర్ యొక్క సర్వసభ్య సమావేశము తేది:20.02.2024, మంగళవారము రోజున ఉ॥11.45 గం॥లకు "కేంద్ర కార్యాలయము కరీంనగర్" నందు శ్రీయుత గౌ॥ శ్రీ కొండూరు రవీందర్‌రావు, బ్యాంకు అధ్యక్షుల గారి అధ్యక్షతన ఏర్పాటు చేయనైనది. కావున కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు యొక్క గౌరవ సభ్యులందరు సదరు సమావేశమునకు హాజరు కావలసినదిగా కోరనైనది.

కరీంనగర్ 17-02-2024
సం/- యన్. సత్యనారాయణ రావు
ముఖ్యకార్యనిర్వహణధికారి

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి

ముస్తాబాద్, ఫిబ్రవరి 19: ఎండలు ముదురుతున్న క్రమంలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ఎంపీడీవో భాస్కరశర్మ సూచించారు. పోతుగల్ గ్రామంలో మంచినీటి పైపులైన్లు, నీటి సరాఫరాను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు తాగునీరు అందించాలని, పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు రాకుండా చూడాలని ఆయన ఆదేశించారు.

బహ్రైయిన్‌లో మార్కండేయ జయంతి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19: శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలను పద్మశాలీ సమాజ్ బహ్రైయిన్‌లో ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. పద్మశాలీలు కుటుంబ సమేతంగా రుద్రాభిషేకం, మార్కండేయ పూజలు చేశారు. వేడుకల్లో పద్మశాలీ సమాజ్ బహ్రైయిన్ గౌరవాధ్యక్షుడు అల్లె గంగాధర్, అధ్యక్షుడు వేముల కృష్ణ, నాయకులు సుదర్శన్, సుధాకర్, శ్రీనివాస్, బాలే శ్రీధర్, కృష్ణహరి, తదితరులు ఉన్నారు.

బహ్రైయిన్‌లో మార్కండేయస్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న పద్మశాలీలు